క్లుప్తంగా

భూ సమస్యలు పరిష్కరించండి

సి.బెళగల్: మండలంలోని పలు గ్రామాలకు చెందిన రైతులు తమ భూ సమస్యలను పరిష్కరించాలని స్పందన కార్యక్రమంలో అధికారులకు అర్జీలు ఇచ్చారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండల అధికారులు స్పందన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గుండ్రేవుల, ఇనగండ్ల, బురాన్‌దొడ్డి, సి.బెళగల్ గ్రామాలకు చెందిన రైతులు భూ రీ సర్వేలో భాగంగా ఏర్పడిన భూ సమస్యలను పరిష్కరించాలని తహసీల్దార్ శేషఫణికి వినతి పత్రాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాసులు, ఎంఈఓ జ్యోతి, ఏఓ మల్లేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అర్జీలపై వెంటనే స్పందించాలి


గూడూరులో స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్న తహసీల్దార్ వెంకటరమణ

గూడూరు: స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలపై వెంటనే స్పందించి పరిష్కరించాలని తహసీల్దార్ వెంకటరమణ ఆదేశించారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో స్పందన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అర్జీ దారులను అధికారులు కార్యాలయాల చుట్టూ ఊరికే తిప్పు కోకూడదన్నారు. తమ పరిధిలో లేని సమస్యలను ఉన్నతాదికారుల దృష్టికి తీసుకుపోవాలని సూచించారు. ఎంపీడీఓ రాముడు, మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడ్, పీఆర్ ఏఈ రాంమోహన్, ఎంఈఓ సునీలమ్మ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ బీసీ సెల్‌లో 8 మందికి చోటు

ఓర్వకల్లు : వైఎస్సార్‌సీపీ అనుబంధమైన బీసీ సెల్‌లో నియోజకవర్గం నుంచి 8 మందికి స్థానం లభించింది. ఈ మేరకు జిల్లా పార్టీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ చేశారు. జనరల్ సెక్రటరీలుగా కె. నాగేశ్వరమ్మ, సి.మధు(శకునాల), కార్యదర్శులుగా బి.భాస్కర్ నాయుడు(కాల్వబుగ్గ), కె.శేషయ్య, వి.లక్ష్మీకాంతయ్య, సంయుక్త కార్యదర్శులుగా టి.గోపినాథ్, పీ.శ్రీనివాసులు, దొమ్మరి మధులను నియమించారు. పార్టీ అనుబంధ కమిటీలలో స్థానం కల్పించిన స్థానిక ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డికి ఎంపికైన వారందరూ కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా అయ్యప్ప పడి పూజ


అయ్యప్ప స్వామి పడి పూజ నిర్వహిస్తున్న దృశ్యం

గూడూరు: స్థానిక పులకుర్తి రహదారిలోని వేదాంతపురిలో సోమవారం అయ్యప్ప స్వామి పడి (మెట్ల) పూజను అయ్యప్ప స్వామి దీక్షాధారులు ఘనంగా నిర్వహించారు. నిర్మాణంలో ఉన్న లక్ష్మీ వెంకటేశ్వర, అయ్యప్ప స్వామి దేవాలయ ఆవరణలో ఈ పూజ కార్యక్రమం జరిగింది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నిర్వాహకులు అన్నదానం నిర్వహించారు.

వైభవంగా షష్టి వేడుకలు

పాణ్యం: మండలంలోని కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్టి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించినట్లు ఈఓ రామకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా స్వామి వారికి తెల్లవారుజామున నుంచి అర్చకులు విశేష పూజలు చేపట్టారన్నారు. సుబ్రహ్మణ్యేశ్వరస్వామి మాలధారులతో దీక్ష విరమణ చేయించినట్లు చెప్పారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పండితులు వేద మంత్రోచ్చారణలతో శాస్త్రోక్తంగా హోమం జరిపించారన్నారు.

క్రిస్మస్ కప్ విజేత ఏనుగుమర్రి

కర్నూలు (టౌన్): క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో నిర్వహించిన సెవన్ ఏ సైడ్ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో ఏనుగుమర్రి జట్టు విజేతగా నిలిచింది. బాలుర విభాగంలో ఈ జట్టు 0–1 గోల్స్ చేసి పెద్దపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జట్టుపై విజయం సాధించింది. రెండో సెమీ ఫైనల్స్‌లో లక్ష్మీపురం జిల్లా పరిషత్ జట్టు 3–0 గోల్స్ చేసి చెరుకుల పాడు జెడ్పీహెచ్ఎస్ జట్టుపై గెలుపొందింది. బాలికల విభాగంలో మొదటి సెమీఫైనల్ మ్యాచ్‌లో ఏనుగుమర్రి జట్టు 5–0 గోల్స్ చేసి చెరుకుల పాడు జెడ్పీహెచ్ఎస్ జట్టుపై విజయం సాధించింది. విజేతలకు జిల్లా ఫుట్‌బాల్ సంఘం అధ్యక్షుడు ముప్పా రాజశేఖర్ ట్రోఫీ అందజేశారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ విజేత ప్యాపిలి

ఆలూరు రూరల్: మండలంలోని మొలగవల్లి గ్రామంలో చెన్నకేశవ స్వామి రోథోత్సవం పురస్కరించుకొని రెండు రోజులుగా నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు సోమవారం సాయంత్రం ముగిశాయి. విజేతగా నిలిచిన ప్యాపిలి జట్టుకు మంత్రి గుమ్మనూరు జయరాం సహకారంతో రూ.51 వేలు, రెండో స్థానంలో నిలిచిన మొలగవల్లి చెన్నకేశవ స్వామి జట్టుకు ఆలూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ నారాయణ సహకారంతో రూ.25 వేలు, మూడో స్థానంలో నిలిచిన ప్యాపిలి–బీ జట్టుకు మొలగవల్లి వైఎస్సార్‌సీపీ నాయకుడు తిక్కన్న, నాలుగవ బహుమతి కింద అనంతపురం జట్టుకు గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకుడు లోకేష్ సహకారంతో రూ.5 వేలు నగదు బహుమతులు అందజేశారు.

జగనన్నతోనే రాష్ట్ర సమగ్రాభివృద్ధి

- ఎమ్మెల్యే డా.జరదొడ్డి సుధాకర్
- రుద్రవరం, దిగువపాడు గ్రామాల్లో 'వై ఏపీ నీడ్స్ జగన్'


దిగువపాడులో ప్రజా సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్

కర్నూలు సిటీ: ఎన్నికల్లో చెప్పిన ప్రతి సంక్షేమ పథకాన్ని సీఎం వై.ఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్నారని, ఒక వైపు సంక్షేమ, మరో వైపు అభివృద్ధి కార్యక్రమాలతో సమగ్రాభివృద్ధి సాధిస్తున్నారని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ అన్నారు. సోమవారం పి.రుద్రవరం, దిగువపాడు గ్రామాల్లో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే అనే కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఆయా గ్రామాల్లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జెండాలను, సచివాలయంలో ఏర్పాటు చేసిన సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నింటినీ అవినీతికి తావు లేకుండా అమలు చేశామన్నారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థల ద్వారా నేరుగా ఇంటికే పింఛన్, సంక్షేమ పథకాలను అందజేస్తున్నామన్నారు. అలాగే రైతులకు సొంత గ్రామంలోనే రైతు భరోసా కేంద్రాల్లో అగ్రికల్చర్ అసిస్టెంట్‌ను ఏర్పాటు చేసి, పంటల నమోదు, ఎరువుల పంపిణీ, పంట నష్టపరిహారం సకాలంలోఅందిస్తున్నామని చెప్పారు. నాలుగున్నరేళ్లలో ఎక్కడా రాజకీయ నాయకులతో సంబంధం లేకుండా నేరుగా అర్హులైన ప్రజల ఖాతాల్లోకి నగదు చేరిందని తెలిపారు. తెలుగుదేశం హయాంలో ప్రజలకు కాకుండా ఆ పార్టీ నాయకుల ఖాతాల్లో చేరిందన్నారు.

అర్హతే ప్రామాణికంగా పథకాలు

రాష్ట్రంలో అమలు అవుతున్న సంక్షేమ పథకాలను పార్టీలకు, కులాలకు, మతాలకు, ప్రాంతాలకు అతీతంగా అర్హతే ప్రామాణీకంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని ఎమ్మెల్యే అన్నారు. టీడీపీ నేతలలాగా మాయ మాటలు చెప్పే అలవాటు తమకు లేదని, మాట ఇచ్చామంటే కచ్చితంగా ఎంత కష్టమైన అమలు చేస్తామన్నారు. మరోసారి జగనన్నను సీఎంగా చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పి.రుద్రవరం సర్పంచ్ మధుసూదన్, వెంకటేష్, చంద్ర, తిలక్ మోహన్, బోయ శ్రీరాములు, బాల మద్దిలేటి, దిగువపాడు సర్పంచ్ సౌభాగ్య లక్ష్మి, ఎంపీటీసీ కృష్ణవేణమ్మ, పురుషోత్తం రెడ్డి, భద్రారెడ్డి, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

నేడు పూడిచెర్లలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

ఓర్వకల్లు : మండలంలోని పూడిచెర్ల గ్రామంలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శివనాగప్రసాద్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ప్రతి గడపకు వెళ్లి ప్రజా సమస్యలను తెలుసుకుంటూనే.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న అవినీతిరహిత పాలన, సంక్షేమ పథకాలను గురించి ప్రజలకు వివరిస్తారని తెలిపారు. ఉదయం 8 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. కార్యక్రమానికి మండలంలోని వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు తప్పక హాజరు కావాలని కోరారు.

గుంతను పూడ్చేశారు


పైప్‌లైన్ కోసం తవ్విన గుంతను పూడ్చేసిన దృశ్యం

సాక్షి ఎఫెక్ట్

కర్నూలు (న్యూటౌన్): ఈ నెల 13వ తేదీన 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన 'గుంతను పూడ్చండి సారూ!' అనే కథనానికి కర్నూలు నగర పాలక సంస్థ అధికారులు స్పందించారు. ఓల్డ్ సిటీలోని 3వ వార్డు అలీషేర్‌బాగ్‌లో తాగునీటి పైప్‌లైన్ కోసం తవ్విన గుంతను సోమవారం మట్టితో పూడ్చి చదును చేశారు. దీంతో స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు.

కార్యకర్తల సంక్షేమమే లక్ష్యం

- వైఎస్సార్‌సీపీ గెలుపు కోసం సైనికుల్లా కష్టపడాలి
- సంక్షేమ పథకాలను ఇంటింటికీ తిరిగి ప్రజలకు వివరించండి
- ఏ కష్టం వచ్చినా అండగా ఉంటాం
- ఎమ్మెల్యే కాటసాని తనయుడు శివ నరసింహారెడ్డి

గడివేముల: నాయకుల సమస్యలే కాకుండా గ్రామ స్థాయిలో పార్టీ కోసం కష్టపడే కార్యకర్తల సమస్యలు పరిష్కరించేందుకు నిరంతరం కృషి చేస్తామని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి తనయుడు కాటసాని శివ నరసింహారెడ్డి తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో వైఎస్సార్‌సీపీ మండల నాయకులు, కార్యకర్తలతో పార్టీ అభివృద్ధి కోసం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సంక్షేమ సారథి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మరోసారి పట్టం కట్టేందుకు ప్రతి ఒక్కరూ కష్టపడాలని పిలుపునిచ్చారు. గ్రామ, మండల స్థాయిలోని నాయకులే కాకుండా మారుమూల ప్రాంతాల్లో ఉన్న ప్రతి కార్యకర్త సంక్షేమమే తమ లక్ష్యమని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం ఎంతో కృషి చేస్తుందని, జగనన్న అడుగుజాడల్లో ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. ప్రభుత్వం నుంచి సంక్షేమ పథకాలు అందుకున్న ప్రతి ఒక్కరూ సంతృప్తి స్థాయిలో ఉన్నారని చెప్పారు. ఎన్నికల సమయం దగ్గరపడుతున్న తరుణంలో ప్రతి కార్యకర్త సైనికుడిగా పనిచేసి పార్టీ విజయానికి సహకరించాలని కోరారు. ఎలాంటి సమయంలోనైనా అండగా ఉంటామని భరోసానిచ్చారు. సమస్యలను తమ దృష్టికి తేవాలని సూచించారు. అలాగే ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఇంటింటికీ తిరిగి ప్రజలకు వివరించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు ఆర్‌బీ చంద్రశేఖరరెడ్డి, పార్టీ మండల ఆధ్యక్షుడు శివరామిరెడ్డి, నాయకులు దస్తగిరిరెడ్డి,శివానందరెడ్డి,శ్రీకాంత్‌రెడ్డి, రఘుమాధవరెడ్డి, లింగేశ్వరరెడ్డి,నాగేశ్వరరెడ్డి,రవీంద్రారెడ్డి, వైస్ ఎంపీపీ కాలునాయక్ పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు పూర్తి చేసుకోవాలి

గూడూరు రూరల్ : ప్రభుత్వం మంజూరు చేసిన ఇంటి స్థలాల్లో గృహ నిర్మాణాలను చేపట్టి.. త్వరగా పూర్తి చేసుకోవాలని ఎంపీడీఓ రాముడు సూచించారు. కె.నాగలాపురంలో సోమవారం లబ్ధిదారులకు గృహ నిర్మాణాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిరు పేదలకు జగనన్న కాలనీలో ఇంటి స్థలంతో పాటు గృహ రుణాన్ని మంజూరు చేసిందన్నారు. కాలనీలో 70 శాతం మేరకు లబ్ధిదారులు గృహ నిర్మాణాలు చేపట్టగా అందులో 40 శాతం మేరకు పూర్తయ్యాయన్నారు.


కె.నాగలాపురంలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ రాముడు

దెబ్బతిన్న పంటలను పరిశీలించిన ఏఐకేఎస్ నాయకులు


పంట పొలాలను పరిశీలిస్తున్న ఏఐకేఎస్ బృందం

కర్నూలు(సెంట్రల్): మండల పరిధిలోని ఉల్చాల గ్రామంలో వర్షాభావంతో దెబ్బతిన్న ఖరీఫ్ పంట పొలాలను ఏఐకేఎస్ జాతీయ కార్యదర్శి విజ్జు కృష్ణన్, ఆర్థిక కార్యదర్శి కృష్ణప్రసాదు, జాతీయ నాయకులు నితీష్, ఏపీ రైతు సంఘం అధ్యక్ష,కార్యదర్శులు వి.కృష్ణయ్య, కె.ప్రభాకర రెడ్డి, జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు రైతులతో మాట్లాడి పెట్టుబడి, వర్షాలు, ఇతర వివరాలను అడిగి తెలుసుకున్నారు. పత్తి, మిరపలో ఎకరాకు రూ.40 వేల పెట్టుబడి పెడితే రూ.6 వేలు చేతికి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. నష్టపోయిన రైతులకు పరిహారం ఇచ్చి ఆదుకునేలా రైతు సంఘాలు ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు.

మహనీయులను స్మరించుకోవాలి

గూడూరు రూరల్ : మహనీయులను ప్రతి ఒక్కరూ స్మరించుకుని వారి ఆశయాల కోసం పోరాడాలని కర్నూలు నగరానికి చెందిన మానసిక వైద్య నిపుణుడు డాక్టర్ హరిప్రసాద్ అన్నారు. కె.నాగలాపురంలోని ప్రాథమిక పాఠశాలలో సోమవారం అంబేడ్కర్, పూలే, సావిత్రిబాయి, ఫాతిమా షేక్ విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమం ఇంటెలెక్చువల్ కలెక్టివ్ సంస్థ, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ మహిళా ఐక్య వేదిక ఆధ్వర్యంలో జరిగింది. బీసీ జాతీయ సంఘం అధ్యక్షుడు నక్కలమిట్ట శ్రీనివాసులు, ఇంటెలెక్చువల్ కలెక్టివ్ సంస్థ జిల్లా కన్వీనర్ ఖదీరుల్లా, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ మహిళా ఐక్య వేదిక ప్రతినిధి పట్నం రాజేశ్వరి, బీసీ నాయకులు శేషఫణి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతి, హక్కుల కోసం పోరాడి యువతను జాగృతం చేసిన అంబేడ్కర్, పూలే, సావిత్రిబాయి, ఫాతిమా షేక్‌లను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. వారి ఆశయాలను కొనసాగించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఆయన తెలిపారు. ఇప్పటి వరకు 50కి పైగా ప్రాంతాల్లో విగ్రహాలను ఆవిష్కరించినట్లు తెలిపారు. సర్పంచు నయోమి, హెడ్ మాస్టర్ దాదామియ్యా, రచయిత ఇనాయతుల్లా, పీఎంసీ చైర్మన్ దాసు పాల్గొన్నారు.


కె.నాగలాపురం పాఠశాలలో విగ్రహాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పాలన

కోడుమూరు : ప్రజల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన కొనసాగిస్తున్నారని కోడుమూరు జెడ్పీటీసీ సభ్యుడు రఘునాథ్‌రెడ్డి అన్నారు. క్రిస్మస్ పండుగ సందర్భంగా వైఎస్సార్‌సీపీ స్టేట్ కమిటీ సభ్యులు సంధ్య విక్రమ్‌కుమార్ సోమవారం సాయంత్రం కోడుమూరులో నియోజకవర్గంలోని పాస్టర్లకు నూతన వస్త్రాలను అందజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జెడ్పీటీసీ రఘునాథ్‌రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు కృష్ణారెడ్డి హాజరయ్యారు. సంధ్య విక్రమ్‌కుమార్ మాట్లాడుతూ నిత్యం ప్రజల సంక్షేమానికి పాటుపడుతున్న జగనన్నకు దేవుడి ఆశీస్సులుండేలా పాస్టర్లంతా ప్రార్థనలు చేయాలన్నారు. అనంతరం పాస్టర్లతో కలిసి వైఎస్సార్‌సీపీ నాయకులు క్రిస్మస్ కేకును కట్ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రమేష్‌నాయుడు, స్థానిక నాయకులు రవికుమార్‌రెడ్డి, మల్లారెడ్డి, తేనేశ్వరరెడ్డి, లింగన్న పాల్గొన్నారు.


పాస్టర్లకు నూతన వస్త్రాలను అందజేస్తున్న దృశ్యం

కలెక్టర్, జేసీలను కలసిన షేక్ జాఫ్రీన్

- స్పోర్ట్స్ కోటాలో గ్రూపు–1 అధికారిగా పోస్టింగ్
- ఆదోని డివిజనల్ సహకార అధికారిగా నియామకం


జిల్లా కలెక్టర్ సృజనను మర్యాదపూర్వకంగా కలిసిన షేక్ జాఫ్రీన్

కర్నూలు(అగ్రికల్చర్): స్పోర్ట్స్ కోటాలో గ్రూపు–1 అధికారిగా నియమితులైన షేక్ జాఫ్రిన్ సోమవారం మర్యాదపూర్వకంగా జిల్లా కలెక్టర్ సృజన, జాయింట్ కలెక్టర్ నారాపురెడ్డి మౌర్యలను కలిశారు. టెన్నిస్‌లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అద్భుతంగా రాణించిన షేక్ జాఫ్రిన్ ప్రతిభ పాటవాలను గుర్తించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం స్పోర్ట్స్ కోటా గ్రూపు–1 అధికారిగా ఉద్యోగం కల్పించింది. సహకార శాఖలో డిప్యూటీ రిజిస్ట్రార్‌గా నియమించింది. ఇటీవలనే ఆదోని డివిజన్ సహకార అధికారిగా బాధ్యతలు చేపట్టిన ఆమె తాజా జిల్లా సహకార అధికారి ఎస్.రామాంజనేయులు, తండ్రి జాకీర్‌తో కలసి కలెక్టర్, జేసీలను మర్యాద పూర్వకంగా కలసి కృతజ్ఞతలు తెలిపారు. డిజబులిటీ కలిగిన జాఫ్రిన్ రెండుసార్లు ఒలింపిక్ క్రీడల్లో మెడల్స్ సాధించారు. 9 ఇంటర్నేషనల్, 8 నేషనల్ మెడల్ సాధించారు. 2020లో రాష్ట్రపతి నుంచి బెస్ట్ స్పోర్ట్స్ పర్సన్ ఇన్ డిజబులిటీ జాతీయ అవార్డు తీసుకున్నారు. ఈమె ప్రతిభను గుర్తించిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రూపు–1 అధికారిగా పోస్టింగ్ ఇవ్వడం విశేషం. ఆదోని డివిజన్ సహకార అధికారిగా నియమితులైన జాఫ్రిన్ జిల్లా స్థాయిలో ఆరు నెలలు ప్రాక్టికల్ శిక్షణ పొందుతారు. మరో ఆరు నెలలు థియరీలో శిక్షణ పొందుతారని జిల్లా సహకార అధికారి తెలిపారు.

ఘనంగా మాళమల్లేశ్వర స్వామి జయంతి పూజలు


దేవరగట్టులో మాళ మల్లేశ్వరస్వామికి పూజలు చేస్తున్న అర్చకులు

హొళగుంద: దేవరగట్టులో సోమవారం మాళ మల్లేశ్వరస్వామి జయంతి (ఉద్భవించిన రోజు) పురస్కరించుకుని ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ సందర్భంగా వేద పండితులు, ఆలయ పూజారులు మూల విరాట్‌లకు సుప్రభాతసేవ, పూల అలంకరణ, మహా రుద్రాభిషేకం, బండరార్చన, కుంకుమార్చన, మహామంగళారతి, నైవేద్య సమర్పణ, ఇతర ప్రత్యేక పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఆలయ నిర్వాహకులు నెరణికి, నెరణికి తండా, కొత్తపేట గ్రామస్తులందరూ తరలి వచ్చారు. ఏటా కార్తీక అమవాస్య తర్వాత ఐదు రోజులకు స్వామివారి జయంతి కార్యక్రమం శాస్త్రోక్తంగ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తులకు ఆస్పరి మఠంలో అన్నదానం ఏర్పాటు చేశారు.

ఎన్నికల ఏర్పాట్లపై దృష్టి సారించాలి

- కలెక్టర్, ఎస్పీలకు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్‌కుమార్ మీనా ఆదేశం
- 22 ,23 తేదీల్లో ఎన్నికల సన్నద్ధతపై సమావేశం నిర్వహిస్తున్నట్లు వెల్లడి


వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్ డాక్టర్ జి.సృజన, ఎస్పీ జి.కృష్ణకాంత్, జేసీ నారపురెడ్డి

కర్నూలు(సెంట్రల్): 2024 సాధారణ ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లపై పూర్తి స్థాయిలో దృష్టి సారించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేస్‌కుమార్ మీనా అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన విజయవాడ నుంచి ఎన్నికల ఏర్పాట్లపై కలెక్టర్లు, ఎస్పీలు, ఇతర ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఎన్నికలకు సంబంధించి ఈవీఎంలు, పోలింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ కేంద్రాల ఏర్పాటు, వాటిలో మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించాలని ఎన్నికల అధికారులను ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల్లో నిరంతర విద్యుత్, మంచినీటి సదుపాయం, మరుగుదొడ్లు కచ్చితంగా ఉండేలా చూడాలన్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే అన్ని స్థాయిల్లో అధికారుల నియామకాలు చేపట్టాలని కలెక్టర్లను ఆదేశించారు. మరోవైపు శాంతిభద్రతలపై ఎస్పీలు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఏర్పాట్లు చేయాలన్నారు. కాగా, ఈనెల 22,23వ తేదీల్లో విజయవాడలో ఎన్నికల సన్నద్ధతపై కలెక్టర్లు, ఎస్పీలకు కేంద్ర ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేస్తున్నామని, ఇప్పటి వరకు జిల్లాలో ఎన్నికల సన్నాహాలకు సంబంధించిన అన్ని నివేదికలతో హాజరు కావాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ డాక్టర్ జి.సృజన, జిల్లా ఎస్పీ జి.కృష్ణకాంత్, జేసీ నారపురెడ్డి మౌర్య, మునిసిపల్ కమిషనర్ భార్గవ్‌తేజ, కర్నూలు ఆర్‌డీఓ హరిప్రసాదు, జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి పాల్గొన్నారు.

నాగమయ్య, లింగమయ్య విగ్రహాల ప్రాణప్రతిష్ఠ


ప్రతిష్ఠించిన నాగమయ్య, లింగమయ్య విగ్రహాలు

కర్నూలు(సెంట్రల్): నగరంలోని బండిమెట్ట గంగాభవాని సమేత కేదారేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణంలో నాగమయ్య, లింగమయ్య విగ్రహాల ప్రాణ ప్రతిష్ఠ జరిగింది. అర్చకులు శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజల నిర్వహించి విగ్రహాలను ప్రతిష్ఠించారు. అనంతరం భక్తులు నాగమయ్య, లింగమయ్యలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. కార్యక్రమంలో భక్తులు జయశ్రీ, రమణ, చాపల రమేష్, జగన్, నరేష్, దాస్, శరత్‌బాబు,పెద్దయ్య పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

కర్నూలు(రాజ్‌విహార్): ఆర్టీసీలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏపీఎస్ఆర్టీసీ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్ తులసీరామ్ కోరారు. సోమవారం ఆ సంఘం ఆధ్వర్యంలో ఆర్టీసీ అధికారులను కలిసి వినతిపత్రం అందజేశారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

కర్నూలు(సెంట్రల్) : ఉపాధి హామీలో పని చేసే ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ అంజిబాబు డిమాండ్ చేశారు. సోమవారం ఫీల్డ్ అసిస్టెంట్లు తమ న్యాయపరమైన డిమాండ్లను పరిష్కరించాలంటూ జెడ్పీ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ చేసి అక్కడ ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు బొజ్జప్ప, గిడ్డయ్య, దేవానంద్ పాల్గొన్నారు.

జోరుగా వరి నాట్లు


పాణ్యంలో వరినాట్లు వేస్తున్న కూలీలు


కొండజూటూరులో కళకళలాడుతున్న వరి నారు

పాణ్యం: మండలంలో వ్యవసాయ బోర్ల కింద రబీలో భాగంగా వరి పంట సాగు జోరుగా సాగుతోంది. ఇప్పటికే ఖరీఫ్ పంటలు కోతలు పూర్తవడంతో రైతులు పంట సాగుకు పూనుకుంటున్నారు. కాగా ఈ ఏడాది వరి ధాన్యానికి మంచి ధర లభిస్తుండటం, ఆశించిన మేర దిగుబడి రావడంతో మరో మారు వరి సాగుకే రైతులు మొగ్గ చూపుతున్నారు. మండలంలో అత్యధికంగా పాణ్యం, కొణిదేడు, ఆలమూరు, కొండజూటూరు, గోరుకల్లు, వద్దుగండ్ల, రసూల్లపేట, గోనవరం గ్రామాల్లో వరి సాగు చేస్తున్నారు. ఈ ఏడాది ఆశించిన మేర వర్షాలు లేకపోయినా శ్రీశైలం నుంచి వచ్చిన నీటిని గోరుకల్లు జలాశయంలో నిల్వ చేసి రైతులకు వారబంధీ పద్ధతిలో ఖరీఫ్ పంటలకు నీరందించారు. దీంతో రైతులు ఆయకట్టు కింద వరి, మిరప, మొక్కజొన్నతో పాటు ఇతర పంటలకు నీటి తడులు అందించారు. కాగా ఎన్నడూ లేని విధంగా తెగుళ్ల అతి తక్కువగా ఉండటం, దిగుబడులు బాగా వచ్చాయి. వరిలో ఎకరాకు 35–45 బస్తాల వరకు దిగుబడులు లభించాయి. ప్రస్తుతం వరి బస్తా (75 కేజీలు) పసిమి మీద ఉంటే రూ.2,200 నుంచి రూ.2,400 వరకు ఆరిన ధాన్యానికి రూ.2,700 వరకు ధర లభిస్తుంది. వర్షాభావం కారణంగా చాలా చోట్ల వరి సాగు కాకపోవడంతో వరిగడ్డికి డిమాండ్ పెరిగింది. ప్రస్తుతం ఎకరం గ్రాసం రూ. 5వేల వరకు పలుకుతుంది. ఆయకట్టు కింద సాగునీరు రాకపోవడంతో రైతులు బోర్ల కింద వరి సాగుకు సిద్ధమవుతున్నారు.ఇప్పటికే వరి నారు నాటుకు సిద్ధంగా ఉంది. గోరుకల్లు, కొండజుటూరు ప్రాంతాల్లో వరినాట్లు పూర్తి చేశారు. పాణ్యం, గోరుకల్లు తదితర ప్రాంతాల్లో నాట్లు వేగంగా సాగుతున్నాయి. కాగా..ఖరీఫ్‌లో 25వేల ఎకరాల్లో వరి పంట సాగైంది. రబీలో దాదాపు 10వేల ఎకరాల్లో వరి పంట సాగయ్యే అవకాశముందని వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు.

విద్యుత్ కార్మికులను రెగ్యులర్ చేయాలి

కర్నూలు(రాజ్‌విహార్): విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న కార్మికులను రెగ్యులర్ చేయాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు పి. నాగరాజు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక విద్యుత్ భవన్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ స్కిల్ కార్మికులకు నెలకు రూ.43, 162 చెల్లించాలన్నారు. రెగ్యులర్ చేసే వరకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కోడుమూరు, పాణ్యం
70750 09147 (కోడుమూరు),
70750 09185 (పాణ్యం)
Office mail : sakshiknladvt@gmail.com